## క్లుప్తంగా

### బ్యాగులు, పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి స్కూల్ బ్యాగ్ అందిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని లక్క వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గెల్లా వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు విజ్జు కృష్ణమూర్తి, విజ్జు వెంకట స్వామి నాయుడు, బండారు సురేష్, ఆరుగొల్లు బజారు, షేక్ నన్నా పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో ఎమ్మెల్యే మద్దిపాటి



ఎమ్మెల్యే మద్దిపాటికి స్వామివారి మెమెంటో అందిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

**ద్వారకాతిరుమల:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈఓ త్రినాథరావు శ్రీవారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, పోలిన శ్రీనివాసరావు, ఎంపీడీఓ తిరుపతిరావు, తహసీల్దార్ జి.రవికాంత్, ఎస్సై జి.సతీష్ పాల్గొన్నారు.

### ఉన్నత విద్యావంతులు కావాలి

**ఏలూరు రూరల్ :** పేద, అనాథ పిల్లలను ఉన్నత విద్యావంతులు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ విజయరాజు అన్నారు. మంగళవారం స్థానిక 18వ డివిజన్‌లోని రివర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద, అనాథ పిల్లలకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్రియ రేఖ దిగువన నివసిస్తున్న కుటుంబాల పిల్లలు సైతం ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొందాలన్నారు. దీనివల్ల సమాజంలో హెచ్చుతగ్గులు తగ్గుతాయని వివరించారు. పేద విద్యార్థుల్లో ధైర్యం నింపి వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలన్నారు. ట్రస్ట్ ద్వారా యువకులు సమాజిక సేవ చేయడం సంతోషించదగ్గ అంశమని కొనియాడారు. అనంతరం పిల్లలకు నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లు, వాటర్‌బాటిల్ తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్, ఉపాధ్యాయుడు జీజే స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

### నీట్ 2024 పరీక్ష రద్దు చేయాలి

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** నీట్ 2024 పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంపై ఇప్పటివరకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కనీసం మాట్లాడకపోవడం బాధ్యతారాహిత్యమే అన్నారు. ప్రజల ఓట్లు కావాలి తప్ప ప్రజల సమస్యలపై స్పందించరా అని ప్రశ్నించారు. ప్రపంచంలో చైనా దేశంలో నిర్వహించే పరీక్ష తర్వాత భారతదేశంలో నిర్వహించే పరీక్ష రెండో అతిపెద్దదని చెప్పారు. నీట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎన్‌టీఏ సంస్థ పూర్తిగా విఫలమయిందని, దాన్ని పర్యవేక్షించడంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నాని డిమాండ్ చేశారు. వెంటనే ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి, ఎటువంటి రాజకీయ జోక్యం లేని వ్యవస్థని ఏర్పాటు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా దేశంలో ఉన్న విద్యార్థులకు భరోసా ఇవ్వాలని నాని కేంద్రాన్ని కోరారు. పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి మాట్లాడుతూ పరీక్ష పేపర్‌ని రూ.30 లక్షలకు అమ్ముకున్నామని దోషులు ఒప్పుకున్నప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు లేవని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఎక్కువగా పేపర్ లీకై నట్టు చెప్పారు. నీట్ కౌన్సిలింగ్ యథావిధిగా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో చాలామంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని క్రాంతి డిమాండ్ చేశారు. ఎం చందన్. సీహెచ్ యశ్వంత్, ఆర్ రేవంత్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# రేషన్ కోసం నడక కష్టాలు తప్పవా!

- నిలిచిపోనున్న ఇంటికే రేషన్ పంపిణీ
- మళ్లీ పాత విధానానికి ప్రభుత్వం మొగ్గు
- గిరిజన ప్రాంతంలో తెరుచుకోనున్న 84 రేషన్ షాపులు



గత ప్రభుత్వ హయాంలో ఇంటికే రేషన్ ఇస్తున్న దృశ్యం (ఫైల్)

**బుట్టాయగూడెం:** కూటమి ప్రభుత్వం చకచకా తమ నిర్ణయాలను అమలు చేస్తోంది. ఇప్పటికే పలు పథకాల పేర్లు మార్చిన ప్రభుత్వం పింఛన్ల పంపిణీ విషయంలో వలంటీర్‌లను పక్కనపెట్టి జూలై 1వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ఇంటికే పింఛను పంపిణీ చేసేవిధంగా నిర్ణయం తీసుకుంది. మంగళవారం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఇంటింటికే రేషన్ కార్యక్రమానికి ముగింపు పలికిపే నిర్ణయం తీసుకుంది. రేషన్ పంపిణీ వాహనాలకు స్వస్తి పలుకుతూ మళ్లీ పాత పద్ధతిలోనే రేషన్ షాపుల్లో ప్రజలకు నిత్యవసర సరుకులు అందించనున్నట్టు మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటించారు. ఏజెన్సీ ప్రాంతంలోనే ఈ పాతపద్ధతిని అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో గిరిజన ప్రాంతంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ నిలిచిపోనుంది.

**తెరుచుకోనున్న 84 రేషన్ డిపోలు**

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో గిరిజన ప్రాంతంలో ఇంటింటికీ రేషన్ కార్యక్రమం నిలిచిపోనుంది. పాతపద్ధతిలోనే కొత్త ప్రభుత్వం రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. ఇందులో గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో 84 రేషన్ డిపోలు తెరుచుకోనున్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో 24 గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో, 60 పౌర సరఫరాల శాఖ ద్వారా నిర్వహించే డిపోలు ఉన్నాయి.

**గిరిజనులకు ఇక కష్టాలే!**

గిరిజన ప్రాంతంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటింటికీ రేషన్ పథకం వల్ల ప్రతి నెలా 10 తేదీ లోగా ఇంటికే రేషన్ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందేది. గడచిన ఐదేళ్లుగా ప్రజలకు ఎటువంటి కష్టం కలుగకుండా వాహనాల్లో ఇంటికి రేషన్ పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే అమలులోకి తీసుకురావడంతో గిరిజనులకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలవ్వనున్నాయి. మైళ్ల దూరం కాలినడకన నడిచి వచ్చి క్యూలో నిలబడి రేషన్ బియ్యం, ఇతర వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి మళ్లీ వస్తుందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

**చింతలపూడి:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో విధిగా చేర్పించాలని కూటమి నాయకులు కోరారు. స్థానిక పాత చింతలపూడి ఎంపీపీ పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంగళవారం కూటమి నాయకులు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హేమలత, టీడీపీ నాయకులు బోడ అనీష్, పక్కాల వెంకటేశ్వరరావు, కె.రాజారత్నం, తాటి అప్పారావు, కె.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### 3న వాహనాల వేలం

**జంగారెడ్డిగూడెం:** వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను జూలై 3వ తేదీన వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ జంగారెడ్డిగూడెం ఇన్‌స్పెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ నేరాల్లో 24 మోటార్ సైకిళ్లు సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ మోటార్ సైకిళ్లను ఎస్‌ఈబీ విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ స్టేషన్‌లో జూలై 3న వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

### 4 నుంచి జ్యేష్టమాసోత్సవాలు



విజయదుర్గమ్మవారు

**జంగారెడ్డిగూడెం :** స్థానిక విజయ దుర్గమ్మవారి ఆలయంలో జ్యేష్ఠ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జూలై 4న మాస శివ రాత్రి పురస్కరించుకుని పల్లకీసేవ, 17న తొలి ఏకాదశి పురస్కరించుకొని విజయదుర్గమ్మవారికి శాకాంబరిగా విశేష అలంకరణ, 19న మూలానక్షత్రం పురస్కరించుకుని చండీహోమం, 20న బోనాలు, పల్లకీసేవ నిర్వహించనున్నట్టు చెప్పారు. చండీ హోమంలో ఉభయ దారులుగా పాల్గొనేందుకు నలుగురు దంపతులకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పంచభూత మరకత శివ లింగమునకు, స్ఫటిక శివ లింగమునకు భక్తులే స్వయంగా అభిషేకాలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ఆలయ కమిటీ ఫోన్ నెంబర్లు 77807 95881, 80740 02266, 79819 11312, 99488 34415, 89786 87777లో సంప్రదించాలని కోరారు.

# అధ్వానంగా బోయగూడెం – నామవరం రోడ్డు



నామవరం సమీపంలో రాళ్లు లేచిపోయి, గోతులు పడిన రోడ్డు



శెట్టివారిగూడెం సమీపంలో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రహదారి

**నరకం చూస్తున్న ప్రయాణికులు**

**చింతలపూడి:** అధికారుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాల కాలంగా నామవరం వెళ్లే రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు అధ్వానంగా మారి, గుంతలు పడి, రాళ్లు లేచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుంతలు పడి అధ్వానంగా తయారైన ఈ రహదారిలో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో దుర్భరంగా మారినట్లు స్థానికులు మండిపడుతున్నారు. ఈ రోడ్డుకు మోక్షమెప్పుడా అని వారు ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. బోయగూడెం నుంచి నామవరం మీదుగా సీతానగరం వెళ్లే ఈ రహదారి ప్రమాదకరంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. గతంలో కనీసం ఆటోలైనా తిరిగేవని ప్రస్తుతం ఆటోలు కూడా రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై ఆటోలు, ద్విచక్ర వాహనాలు అనేక సార్లు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. రోడ్డుపై కంకర రాళ్లలేచిపోయి కనీసం సైకిల్‌పై కూడా వెళ్లలేని దుస్థితి ఉందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. 2014లో ఒకసారి, ఇటీవల ఎన్నికలకు ముందు ఒకసారి ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాని రోడ్డు నిర్మాణ పనులు మాత్రం జరగలేదు. దీంతో ఈ సారైనా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రహదారిని నిర్మాణం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అన్నప్రసాద వితరణ

**జంగారెడ్డిగూడెం:** స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని వల్లీదేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. పట్టణానికి చెందిన జేసీబీ వాహన నిర్వాహకులు, కమిటీ సభ్యులైన చిన్నం శివన్నారాయణ, విజయ నాగలక్ష్మి దంపతుల ద్రవ్య సహకారంతో అన్నప్రసాద వితరణ చేసినట్టు అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక కూరగాయల, కిరాణా వ్యాపారులు, పాల కేంద్రాల వర్తకులు, దాతలు ద్రవ్య సహకరణ అందించారన్నారు. కంచర్ల జితేంద్ర దంపతులు మంచి నీరు అందించగా, సుమారు 1500 మందికి అన్నప్రసాదం స్వీకరించినట్టు అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షులు గండికోట బాబి తెలిపారు. వాలంటీర్లుగా సేవలనందించిన వారికి, కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రజనీకాంత్

**లింగపాలెం:** ఎస్‌బీఐ నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే.. మరలా వెంటనే రైతులకు తిరిగి రుణాలు ఇస్తామని ధర్మాజీగూడెం ఎస్‌బీఐ మేనేజర్ పి.రజనీకాంత్ అన్నారు. ధర్మాజీగూడెం ఎస్‌బీఐ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రజనీకాంత్ మంగళవారం సాక్షితో మాట్లాడారు. ధర్మాజీగూడెం బ్రాంచి నుంచి రూ.150 కోట్లకు పైగా వివిధ రకాల రుణాలను ఖాతాదారులకు అందించామన్నారు. తీసుకున్న రుణాలను చెల్లించకపోతే మొండి బాకీగా తయారవుతుందని, దీని వల్ల ఖాతాదారులకు నష్టం చేకూరుతుందని తెలిపారు. వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు కొత్త వారికి రుణాలు ఇస్తామని, ఉద్యోగులకు బ్యాంకు ద్వారా వివిధ స్కీమ్‌ల కింద రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తామని రజనీకాంత్ తెలిపారు.

# కేంద్రమంత్రికి వర్జీనియా రైతుల వినతి



కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**కొయ్యలగూడెం:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ని మంగళవారం ఢిల్లీలో కలుసుకున్నట్టు ఎస్ఎల్ఎస్ పరిధిలోని వర్జినియా పొగాకు రైతు ప్రతినిధులు పేర్కొన్నారు. వర్జీనియా పొగాకు అదనపు పంటపై వేస్తున్న అపరాధ రుసుము రద్దు చేయాలని కోరినట్టు తెలిపారు. దశాబ్ద కాలంగా ఈ సమస్యపై పోరాడుతున్నప్పటికీ పరిష్కారం కాలేదని వివరించామన్నారు. అపరాధ రుసుమును రద్దు చేయడం వల్ల రైతాంగానికి మేలు చేకూరుతుందని తెలిపారు. గత సీజన్లో తుఫాన్ వల్ల పంటలు దెబ్బ తిన్న విషయాన్ని మంత్రికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. అపరాధ రుసుము రద్దుపై రైతులకు అనుకూలంగా వ్యవహరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

# నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

**జంగారెడ్డిగూడెం:** చింతలపూడి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కోరారు. మంగళవారం స్థానిక గరల్స్ హైస్కూల్లో కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను రవి, సీపీఎం మండల కార్యదర్శి ఎంజీవరత్నంలు కలిసి, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములు స్థానిక పేదలకు సాగుకు ఇవ్వాలని, నియోజకవర్గంలో ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు, దళితులకు పంచాలని, సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని, చింతలపూడిలో బస్ డిపో ఏర్పాటు చేయాలని, చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో రోడ్లు, డ్రెయిన్ల సమస్య పరిష్కరించాలని కోరారు. పట్టిసపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, జంగారెడ్డిగూడెంలోని పంగిడిగూడెం రోడ్డులోని పీహెచ్‌సీ కాంపౌండ్ వాల్ కట్టి తిరిగి ప్రారంభించాలని, జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పరికరాలు మందులు సరఫరా చేయాలని పేర్కొన్నారు. బోగోలు అటవీ భూములు చింతలపూడి నియోజకవర్గంలో అసైన్ సీలింగ్ భూములు దళితులకు పేదలకు పంచాలని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలన్నిటిపై అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలాగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని రవి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, పార్టీ చింతలపూడి మండల కన్వీనర్ ఆర్‌వీఎస్ నారాయణ, మండల కమిటీ సభ్యులు జి.సూరిచంద్రం, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్‌రావు, వై.సీత, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయానికి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల అందజేత



ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందిస్తున్న దాతలు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి దాతలు ఎం సాంబశివరావు, ఎం చిట్టిబాబు, 5 ఫ్యాన్లు, 5 ట్యూబ్ లైట్లు అందజేశారు. మంగళవారం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు గ్రంథాలయ అధికారులకు ఆయా వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి, ఉద్యోగార్జనే లక్ష్యంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని రిఫరెన్స్ విభాగంలో అనేక మంది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదువుతున్నారని, అటువంటి వారికి సౌకర్యార్థం ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకుడు నారాయణరావు, సహాయ గ్రంథపాలకులు వీటి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# వేగంగా గాలిగోపుర నిర్మాణం



అంకాలగూడెం సమీపంలోని శివాలయం ఎదుట చేపట్టిన గాలి గోపుర నిర్మాణం

**కొయ్యలగూడెం:** అంకాలగూడెంలోని స్వయంభు ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయం ఎదుట గాలి గోపుర నిర్మాణం వేగవంగా కొనసాగుతోంది. సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో 47 అడుగుల ఎత్తున గోపురం, గోపురానికి నలుదిశలా దేవతామూర్తుల విగ్రహాలతో తూర్పు దిక్కుకు అభిముఖంగా నిర్మిస్తున్నట్లు తెలిపింది. భక్తుల విరాళాలతో గాలిగోపురం నిర్మిస్తున్నట్టు పేర్కొంది. దాతలు ఫోన్ నెంబర్ 83310 12477లో సంప్రదించాలని కోరింది.

**ఇత్తడి తాపడం పనులకు శ్రీకారం**

కొయ్యలగూడెంలోని టెంపుల్స్ సెంటర్లో ఉన్న శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మవారికి భక్తులు ఇత్తడిని విరాళంగా అందించాలని ఆలయ కమిటీ కోరింది. ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం పనులు ప్రారంభించారు. భక్తులు పాత లేదా కొత్త ఇత్తడిని అమ్మవారికి కానుకల రూపంలో అందించాలని కోరింది.

# షాపులను ముందుకు జరపొద్దు



శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలో ఫ్యాన్సీ షాపులను వెనక్కి జరిపిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

**ద్వారకాతిరుమల:** శ్రీవారి కొండపైన తూర్పు ప్రాంతంలో షాపులను ముందుకు జరిపి, భక్తులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఆలయ అధికారులు సూచించారు. ఇటీవల దేవస్థానం నిర్వహించిన బహిరంగ వేలంపాటల్లో హెచ్చు పాటదారులుగా నిలిచి, షాపులను దక్కించుకున్న వ్యాపారులు అధికారులు సూచించిన ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేసుకున్నారు. ఫ్యాన్సీ, కూల్ డ్రింక్ తదితర వ్యాపారాలు సాగిస్తున్నారు. అయితే నిబంధనలను మీరి దుకాణాలను ముందుకు జరిపి, వ్యాపారాలు చేయడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నట్టు ఆలయ అధికారులు గుర్తించారు. వెంటనే షాపులను వెనక్కి జరపాలని సూచించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం దగ్గరుండి షాపులను వెనక్కి జరిపించారు.

# అంజన్న సేవలో భక్తులు



మద్దిక్షేత్రంలో భక్తులు

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఒక రోజు స్వామివారికి రూ.1,47,955 ఆదాయంరాగా, 1200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించినట్టు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం



స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

**జంగారెడ్డిగూడెం:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, రామచంద్రాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవ జోజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, ఎంఈఓలు బి.రాముడు, జి.రాములు, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**ఏరియా ఆసుపత్రి పరిశీలన**

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పరిశీలించారు. ఈ ఆసుపత్రి నుంచి బయట ఆసుపత్రులకు రిఫర్స్ ఎక్కువ అవుతున్నాయని వైద్యులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్క కాటు కేసులు ఎక్కువయ్యాయని, వాటి నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లుగా వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను వచ్చే సమావేశంలో తనకు అందజేయాలని ఆదేశించారు. ఆర్డీఓ కె.అద్దయ్య, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగునికి చంక కర్రల అందజేత

**ఏలూరు (టూటౌన్):** దివ్యాంగుల ఉపకరణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని విభిన్న ప్రతిభావంతుల జిల్లా కార్యాలయంలో మంగళవారం భీమవరానికి చెందిన దివ్యాంగుడు కొరడా శ్రీనివాస్‌కు చంక కర్రలు (క్రచ్చస్)ను ఆమె అందజేశారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందించనున్నట్టు చెప్పారు. అవసరమైన వారు ముందుగా జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుడు కొరడా శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

# ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం



మాట్లాడుతున్న గారపాటి చౌదరి

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య చరిత్రలో ఓ చీకటి అధ్యాయం అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. స్థానిక సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కాలేజీలో మంగళవారం సాయంత్రం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చౌదరి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యం రాజకీయ చరిత్రలో అత్యంత ఘోరమైన చీకటి అధ్యాయమని అన్నారు. రాజ్యాంగ హక్కులను హరించి తద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా నాడు నియంతృత్వ పాలన కొనసాగిందని గుర్తుచేశారు. అర్జుల మురళి మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించిన కాలంలో దేశంలో ఎదురైన ఇబ్బందులను, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అమలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ఏలూరుకు చెందిన ముద్దాని దుర్గారావును ఘనంగా సన్మానించారు. కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్నేని కృష్ణ ప్రసాద్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కీర్తి రాంప్రసాద్ పాల్గొన్నారు.